క్లుప్తంగా

వైభవంగా వెంకటేశ్వర స్వామి మాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: నగరంలోని కేశవస్వామిపేటలో శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో శనివారం శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీ వెంకటేశ్వరస్వామి మాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

చదరంగం అభివృద్ధికి కృషి

ఒంగోలు: జిల్లాలో చదరంగం అభివృద్ధికి కృషి చేస్తానని షేక్ అబ్దుల్ నబీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న తిరుపతిలోని వైశ్రాయ్ హోటల్‌లో నిర్వహించిన ఏపీ చెస్ అసోసియేషన్ సమావేశంలో ప్రకాశం జిల్లా నూతన కమిటీ ఎంపిక జరిగిందని, అందులో తాను జిల్లా కార్యదర్శిగా ఎంపికయ్యానని చెప్పారు. అధ్యక్షునిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా పి.కుమారస్వామి నియమితులైనట్లు వెల్లడించారు. తమను ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీవీ శర్మ, వైస్ చైర్మన్ దివాకర్‌రెడ్డి, కార్యదర్శి ఎస్.భీమారావు, కోశాధికారి జ్వాలాముఖి, తిరుపతి స్పోర్ట్స్ అథారిటీ సీఈవో మురళీ కృష్ణ ఎంపిక చేసినట్లు వివరించారు.

సీతారామచంద్రస్వామి ఆలయ 11వ వార్షికోత్సవం

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరం సీతారామ చంద్రస్వామి, పోలేరమ్మ దేవస్థానం 11వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మూలవిగ్రహాలకు అభిషేకాలు, శాంతి హోమం, పూర్ణాహుతి, సీతారాముల కల్యాణం, మహామంగళ హారతి వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు సాయిబాబా మందిరం 15వ వార్షికోత్సవం

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల శిరిడీ సాయిబాబా మందిరం 15వ వార్షికోత్సవం సందర్భంగా సాయిబాబాకు ఆదివారం ప్రత్యేక పూజలు చేయనున్నట్లు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అన్నదానం, సాయంత్రం 5 గంటలకు పల్లకీలో ద్వారకామాయి బాబా విగ్రహం గ్రామోత్సవం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజావ్యతిరేక బీజేపీని సాగనంపుదాం

పుల్లలచెరువు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో పుల్లలచెరువులో శనివారం ర్యాలీ నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవేండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాని మోదీపాలనలో సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవనం కష్టతరంగా మారిందన్నారు. కోటి ఉద్యోగాల హామీ అటకెక్కినట్లు ఆవేదన వ్యకం చేశారు. మోదీని గద్దె దించి దేశాన్ని కాపాడుకోవాలే నినాదంతో ఈ నెలాఖరు వరకు ఉద్యమం చేపడుతున్నట్లు చెప్పారు. నాయకులు గురునాథం, తిరుమలయ్య, విశ్వరూపాచారి, కనకచారి, జయరావు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

దొనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 17న సోమవారం దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు వికలాంగుల మండల అధ్యక్షుడు కాశయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మేళా నిర్వహిస్తామన్నారు. పొదిలి ఆర్టీసీ డిపో సిబ్బంది బస్‌పాస్ మేళాలో పాల్గొంటారన్నారు. దివ్యాంగులు తమ ఆధార్, సదరం జిరాక్స్ కాపీలు, పాస్‌ఫోటో, రూ.100 నగదు తీసుకుని ఎంపీడీఓ కార్యాలయంలో బస్‌పాస్ పొందొచ్చని, ఈ అవకాశాన్ని మండలంలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కాశయ్య కోరారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

పెద్దారవీడు: మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌పై సోషల్ మీడియా, యూట్యూబ్ చానల్లో ప్రచారం చేస్తున్న కథనాలను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కష్టారెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం సాయంత్రం మార్కాపురంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మండలంలో దేవరాజుగట్టులో సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మంత్రి సురేష్‌కు నిరసన సెగ అంటూ వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని చెప్పారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలో ఏదేదో జరిగిపోతోందని కొంత మంది టీడీపీ నాయకులు చెప్పిన మాటలు విని యూట్యూబ్ చానల్ ప్రతినిధులు పనిగట్టుకొని అసత్యాలు ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. మండల సచివాలయ కన్వీనర్ ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, సొంటి నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

రాచర్ల: మండల కేంద్రంలో విద్వాన్ స్కూల్ ప్రాంగణంలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుగర్, బీపీ, గుండె, కిడ్నీ, కంటి పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

సమన్వయంతో పనిచేయాలి

- అధికారులు, నాయకులకు సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, పక్కన ఎంపీపీ వాకా అరుణ, అధికారులు

మద్దిపాడు: అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి బాటలో నడపాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించిన మద్దిపాడు మండల సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాబోయే ఎన్నికల సమయానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలన్నీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ నాయకులు ప్రభుత్వ పనితీరు బాగా లేదని, గ్రామాల్లో అభివృద్ధి జరగలేదని విష ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలో కోటిన్నర రూపాయలతో ఐదు ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నామని, గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి చేశారో చెప్పగలరా అని సవాల్ విసిరారు. ఏ గ్రామ సచివాలయం పరిధిలోనైనా గత టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి లెక్కలు తీద్దామన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల తమ పాలనలో జరిగిన అభివృద్ధిపై చర్చించడానికి ఎక్కడికైనా వస్తామని, ఆ సవాలును స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారా..? అంటూ టీడీపీ నాయకులను ప్రశ్నించారు. హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఏఈలు చక్కగా పనిచేస్తున్నారని కితాబునిచ్చారు. ఎలక్ట్రికల్ ఇన్‌చార్జి ఏఈపై పలు ఫిర్యాదులు అందడంతో.. పని తీరు మార్చుకోకపోతే కష్టమే అంటూ అతన్ని సున్నితంగా ఎమ్మెల్యే హెచ్చరించారు. గ్రామ సచివాలయాలలో ఏఎల్ఎంలు పనులు చేయడం లేదని, అందువలన గ్రామాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు నాయకులు సమావేశం దృష్టికి తెచ్చారు. పని చేయని వారిని సరెండర్ చేస్తూ తనకు లేఖ రాయాలని, తాను ఉన్నతాధికారులకు పంపి వారిపై చర్యలకు సిఫార్సు చేస్తానని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. అధికారులు చక్కగా పని చేస్తూ మండలంలో మంచి పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి మాట్లాడుతూ గ్రామ నాయకులను సమన్వయం చేసుకుంటూ అధికారులు పనులు నిర్వహించాలని తెలిపారు. గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి పనులు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. సమావేశం అనంతరం పెదకొత్తపల్లి అంజయ్య నగర్‌కు చెందిన యువకులు తమ కాలనీకి 15 రోజుల నుంచి నీరు రావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఎంపీడీవో, గ్రామ కార్యదర్శి, సర్పంచ్‌లను పిలిపించి సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో తహసీల్దార్ జి.రజనీకుమారి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంక్రటావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సొసైటీల అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

- అందుకే జగనన్న అంటే నమ్మకం
- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



ఉప్పుగుండూరులో స్టిక్కర్లు అంటిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

నాగులుప్పలపాడు: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అందుకనే అందరూ మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ నినదిస్తున్నారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప్పుగుండూరులో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికి తిరిగి మా నమ్మకం నువ్వే జగనన్న అనే స్టిక్కర్లను ఎమ్మెల్యే అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అర్హులైన వారందరికీ అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి అందకపోతే వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు చేరేలా గృహ సారథులు, కన్వీనర్లు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, కొమ్మూరి సుధాకర్, రాంబాబు, జయమ్మ, అనూరాధ, చెన్నకేశవులు, విజయకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే గ్రామాల అభివృద్ధి...

కొత్తపట్నం: గ్రామాల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయడం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని పార్టీ యువజన విభాగం మాజీ అధ్యక్షుడు తంబి కాంతారావు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా కొత్తపట్నంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు ఎన్ని వచ్చాయి, టీడీపీ ప్రభుత్వంలో ఎన్ని పథకాలు వచ్చాయనే విషయాన్ని వివరించారు. ప్రజలు గమనించి వైఎస్సార్ సీపీకి మద్దతివ్వాలని కోరారు. ప్రతి ఇంటికి తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. వారి అనుమతితో ఇంటికి స్టిక్కర్లు అతికించారు. గృహ సారథులు, కన్వీనర్లు, నాయకులు గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తంబి వెంకటేశ్వర్లు, బేల్దారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సీతారామ కల్యాణం



గొట్లగట్టులో భజనలు చేస్తున్న భక్తులు



కొనకనమిట్ల: పూజలు నిర్వహిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

కొనకనమిట్ల: అంతా రామమయం.. జగమంతా రామమయం అంటూ సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. వింజవర్తిపాడులో పట్టాభిరామస్వామి ఆలయాల్లో శనివారం సీతారాముల కల్యాణాన్ని భక్తుల కోలాహలంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం రైతులు తమ ఎడ్లను పూజించి స్వామివారికి పానకం బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. గొట్లగట్టులో సీతారాముల వారికి పదహారు రోజుల పండగ ఉత్సవం నిర్వహించారు.

వెలుగొండలో భక్తుల సందడి

నమో వేంకటేశాయా నమోనమః అంటూ మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వర స్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండల తహసీల్దార్ కేతబోయిన ప్రవీణ్‌కుమార్ వెలుగొండస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు డీటీ ప్రకాష్, వీఆర్‌ఓలు దిలీప్ కుమార్, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు. అలాగే వాగుమడుగు పంచాతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు, అభయాంజనేయస్వామికి అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

రక్షణ కల్పించాలంటూ మహిళ ఫిర్యాదు

ఒంగోలు టౌన్: తనను వేధింపులకు గురిచేస్తున్న ఉస్మాన్ అనే వ్యక్తి నుంచి రక్షణ కల్పించాలంటూ ఓ ఉద్యోగిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. నగరంలోని ఆర్పీ రోడ్డులో నివశించే కొండవీటి శివపార్వతి కో ఆపరేటివ్ డిపార్ట్‌మెంటులో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం చేస్తోంది. మనస్పర్థల కారణంగా భర్తతో విడాకులు తీసుకుని తన ఇద్దరు కుమారులతో కలిసి జీవిస్తోంది. మూడేళ్ల క్రితం ఆమెకు షేక్ ఉస్మాన్ అనే వ్యక్తితో పరిచయమైంది. అతడు తరచూ ఆమె ఇంటికి వెళ్లేవాడు. కొద్ది నెలలుగా అనుమానంతో ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. తరచూ గొడవపడటమే కాకుండా బూతులు తిడుతున్నాడు. దీంతో ఆమె తన వద్దకు రావద్దని చెప్పగా, ఆగ్రహానికి గురైన ఉస్మాన్ మరింత రెచ్చిపోవడమే కాకుండా ఆమెను చంపుతానని బెదిరిస్తున్నాడు. రెండురోజులుగా ఆమెను కొట్టడమే కాకుండా గొంతుపిసికి చంపేందుకు ప్రయత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో పక్క గదిలో నిద్రిస్తున్న ఆమె కుమారులు వచ్చి రక్షించారు. ఆ మేరకు శుక్రవారం రాత్రి వన్‌టౌన్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

కొమరోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా ఇళ్లబాట పట్టారు. మండలంలో 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా కట్టుదిట్టమైన భద్రత నడుమ పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

అన్నదానం మహాదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మార్కాపురం: శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామివారి రథోత్సవం సందర్భంగా వచ్చే భక్తులకు అన్నదానం చేయటం అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం స్వామివారి రథోత్సవం సందర్భంగా పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రాంభించారు. స్థానిక కంభం రోడ్డులోని వీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదరి పి.ఎల్.పి యాదవ్‌లతో కలిసి ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక రీడింగ్ రూం ఆడిటోరియం వద్ద భక్తులకు మజ్జిగ అందజేశారు. నాయుడు బజార్, నెహ్రూ బజార్, దోర్నాల బస్టాండ్, కంభం రోడ్, పాత బస్టాండ్, మెయిన్ బజార్లలో పలు అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

మంత్రి కాకానిని కలిసిన నేతలు



మంత్రిని సన్మానిస్తున్న మద్దిశెట్టి, జెడ్పీటీసీ

తాళ్లూరు: వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌ను నెల్లూరులో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిశెట్టి రవీంద్ర, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి కలిశారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గంగిరెడ్డిపాలెం యలమందారెడ్డి, కళింగ రెడ్డి నాయకుల వెంట ఉన్నారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కొమరోలు: రహదారి ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. కొమరోలు మండలంలోని గోనపల్లె గ్రామానికి చెందిన పెద్దినేని రమణయ్య ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం కొమరోలుకు వచ్చి పని ముగించుకుని తిరిగి ద్విచక్ర వాహనంపై తన స్వగ్రామం గోనపల్లె గ్రామానికి వెళుతోంది. బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలోకి వెళ్లగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రమణయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రుడిని గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఏఎస్ఐ గోపాలక్రిష్ణ విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు.

సుంకర మస్తాన్‌రెడ్డి విగ్రహం ఆవిష్కరణ



సుంకర మస్తాన్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, జంకె వెంకటరెడ్డి, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: చీమకుర్తి ప్రథమ ఎంపీపీ సుంకర మస్తాన్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని శుక్రవారం రాత్రి చీమకుర్తిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. మస్తాన్‌రెడ్డి సొంత స్థలాన్ని ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి గతంలో అందించిన సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ కుమారుడు సుంకర ఓబుల్‌రెడ్డి, రమణమ్మల ఆర్థిక సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ మండలాల వ్యవస్థ ఏర్పడిన తర్వాత మొట్టమొదటి ఎంపీపీగా సుంకర మస్తాన్‌రెడ్డి చీమకుర్తి అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారని కొనియాడారు. కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మస్తాన్‌రెడ్డి కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

షాపింగ్ మాల్లో అగ్ని ప్రమాదాలు నివారించవచ్చు



సీఎంఆర్ షాపింగ్ మాల్ వద్ద గ్యాస్ సిలిండర్ ప్రమాదంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది, అధికారులు

ఒంగోలు టౌన్: తగిన జాగ్రతలు తీసుకుంటే షాపింగ్‌మాళ్లలో జరిగే అగ్ని ప్రమాదాలను నివారించడం సులువవుతుందని, నష్ట నివారణ కూడా సాధ్యమవుతుందని విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి ఎస్.వేణుగోపాలరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండోరోజైన శనివారం నగరంలోని కర్నూలు రోడ్డులో గల సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న సిబ్బందికి అవగాహన కల్పించారు. షాపింగ్ మాల్స్‌లో, నివాస గృహాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన నివారణ చర్యలను ప్రదర్శన ద్వారా తెలియజేశారు. అలాగే ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు, అక్కడ విధులు నిర్వహించే సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించడమే కాకుండా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎఫ్‌వో వి.శ్రీనివాసులరెడ్డి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు



చివరి పరీక్ష రాసి బయటకు వస్తున్న పదో తరగతి విద్యార్థులు



అనారోగ్యానికి గురైన విద్యార్థికి ట్రీట్‌మెంట్ చేస్తున్న డాక్టర్

మద్దిపాడు: మండలంలోని కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాల, దొడ్డవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. మద్దిపాడు కేవైజీహెచ్ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న చీమకుర్తి మండలం పల్లామల్లికి చెందిన గండి కోటేశ్వరరావు అనే విద్యార్థి అనారోగ్యంతోనే పరీక్షకు హాజరయ్యాడు. ఈ క్రమంలో పరీక్ష రాయలేక సొమ్మసిల్లి పడిపోగా, పరీక్ష కేంద్రంలో ఉన్న ఏఎన్ఎం వెంటనే పీహెచ్‌సీ డాక్టర్‌కు సమాచారం అందించారు. వారు ప్రథమ చికిత్స చేసి 108 అంబులెన్స్‌లో ఒంగోలు తరలించారు.

మట్టి నమూనాల సేకరణపై అవగాహన అవసరం



మట్టి నమూనాలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

చీమకుర్తి: మట్టి నమూనాల సేకరణపై గ్రామస్థాయిలోని వ్యవసాయ సహాయకులకు వ్యవసాయ సహాయ సంచాలకుడు బీ రమేష్‌బాబు శనివారం అవగాహన కల్పించారు. సంతనూతలపాడులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మట్టి నమూనాల పరీక్షల వలన భూమిలోని మూలకాల వివరాలు తెలుసుకోవడం ద్వారా ఎలాంటి ఎరువులు వినియోగించాలి, వాటి ద్వారా భూమిని సారవంతంగా ఏ విధంగా ఉంచుకోవాలనే విషయాలు తెలుస్తాయని తెలిపారు. అనంతరం ఎండ్లూరు గ్రామంలో మండల వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో మట్టి నమూనాలు తీయడం గురించి వివరించారు.

ఆయుర్వేద మందుల విక్రయాలపై తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఒంగోలు టౌన్: నగరంలోని దిబ్బల రోడ్డులో చెరుకూరి హనుమంతరావుకు చెందిన రాధికా ఎంటర్‌ప్రైజెస్‌లో ఆయుష్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. హనుమంతరావు కొద్ది రోజులుగా అనధికారికంగా ఆయుర్వేద మందుల వ్యాపారం చేస్తున్నట్లు రాష్ట్ర ఆయుష్ కమిషనర్‌కు అందిన ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించిన అధికారులు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు లావాదేవీలు నిలిపివేయాలని ఆదేశించారు. సదరు సంస్థతో లావాదేవీలు నిర్వహించేవారు ఈ విషయాన్ని గమనించాలని, ఆ తర్వాత జరిగే పరిణామాలకు ఆయుష్ విభాగం బాధ్యత వహించదని అధికారులు తెలిపారు.